## క్లుప్తంగా

### వెంకటేశ్వర్లు సేవలు ఎనలేనివి



**వింజమూరు(ఉదయగిరి):** వరికుంటపాడు మండలం గణేశ్వరపురం ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న డబ్బుగొట్టు వెంకటేశ్వర్లు ఉద్యోగ విరమణ సభను వింజమూరులోని ఓ కల్యాణ మండపంలో గురువారం నిర్వహించారు. విద్యాశాఖ అధికారులు, సహచర ఉపాధ్యాయులు, బంధువులు,స్నేహితులు పాల్గొని వెంకటేశ్వర్లు దంపతులను ఘనంగా సత్కరించారు. హెచ్ఎంగా ఆయన అందించిన సేవలను కొనియాడారు. ఎంఈఓలు పీ రమేష్, రమణయ్య, విశ్రాంత డీఎంహెచ్ఓ మాసిలామణి, తదితరులు పాల్గొన్నారు.

### గుండెపోటుతో ఏడీఏ రామిరెడ్డి మృతి



రామిరెడ్డి(ఫైల్)

**వింజమూరు(ఉదయగిరి)/ కలిగిరి:** వింజమూరు వ్యవసాయ సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు నారపరెడ్డి రామిరెడ్డి(61) గుండెపోటుతో గురువారం ఉదయం మృతి చెందారు. ఎంతో నిబద్ధతో విధులు నిర్వహించే ఆయన ఆకస్మికంగా మృతి చెందడంపై పలువురు విస్మయం చెందారు. వింజమూరులోని నివాసంలో ఉంచిన రామిరెడ్డి భౌతికకాయాన్ని జిల్లా వ్యవసాయాధికారి సత్యవాణితో పాటు వ్యవసాయాధికారులు శివన్నారాయణ, చెన్నారెడ్డి, ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కాగా ఏడీఏ మృతిపై కలిగిరిలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాల నిర్వాహకులు స్వచ్ఛందంగా దుకాణాలు మూసివేసి సంతాపం తెలిపారు. గత 15 ఏళ్లుగా ఈ ప్రాంతంలో విధులు నిర్వహిస్తూ రైతులు, వ్యాపారులు, అన్ని శాఖల ఉద్యోగుల్లో రామిరెడ్డి మంచిపేరు తెచ్చుకున్నారు. అందరితో కలివిడిగా ఉంటూ ఎప్పటికప్పుడు వ్యవసాయంలో తగిన సలహాలు, సూచనలు అందజేసే ఆయన మృతిపై రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

### విక్రమ్‌రెడ్డి, బొమ్మిరెడ్డికి సన్మానం



**ఆత్మకూరు:** ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, జెడ్పీ మాజీ చైర్మన్ బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డిని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ మున్సిపల్ ప్రధాన కార్యదర్శిగా నియమితులైన అల్లారెడ్డి ఆనంద్‌రెడ్డి గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. నెల్లూరులోని మేకపాటి నివాసంలో వారిని కలిసి సన్మానించారు. తనకు రాష్ట్ర స్థాయి పార్టీ పదవి రావడానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట పార్టీ పట్టణాధ్యక్షుడు నాగలపాటి ప్రతాప్‌రెడ్డి, నాయకులు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, కోర్సిపాటి కిషోర్‌రెడ్డి, వెంగళరెడ్డి, గంగవరపు శ్రీనివాసులునాయుడు, తదితరులు ఉన్నారు.

### పింఛన్లు పంపిణీ

**జలదంకి (ఉదయగిరి) :** జలదంకి మండలం జమ్మలపాళెంలో ఎమ్మెల్యే కాకర్ల సురేష్ గురువారం పర్యటించారు. ఎస్సీ, బీసీ, మిక్స్‌డ్ కాలనీల్లోని పలువురు లబ్ధిదారులకు సామాజిక పింఛన్ నగదు అందజేశారు. ఎంపీడీఓ బ్రహ్మయ్య, సర్పంచ్ బుర్రి శ్రీవేణి, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికులకు టవళ్లు, చెప్పుల పంపిణీ



**కావలి :** కార్మికుల దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వ పింఛనర్ల సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు చేతి గ్లౌజులు, చెప్పులు, టవళ్లు, తదితరాలను గురువారం అందజేశారు. పట్టణంలోని పెన్షనర్స్ భవనంలో మున్సిపల్ డీఈ సాయిరామ్ చేతుల మీదుగా 20 మంది కార్మికులకు వీటిని అందజేశారు. సంఘ అధ్యక్షుడు ఆకుల రమణయ్య, సహాధ్యక్షుడు పూడితాకు రవికుమార్, కార్యదర్శి జలజనాభయ్య, ట్రెజరర్ యేపూరు వెంకయ్య, కార్యవర్గ సభ్యులు సుధాకర్, రహంతుల్లాఖాన్, సచివాలయం అడ్మిన్ మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

### ఐటీఐ ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

**సంగం:** స్థానిక ప్రభుత్వ ఐటీఐలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ కే ఏడుకొండలు గురువారం తెలిపారు. 40 ఎలక్ట్రీషియన్ సీట్లు, 40 ఫిట్టర్ సీట్లు ఖాళీగా ఉన్నాయని చెప్పారు. పదోతరగతి ఉత్తీర్ణులైన వారు అర్హులని తెలిపారు. వివరాలకు 98667 20544, 99639 50604, 63005 99477 నంబర్లలో సంప్రదించాలని కోరారు.

# కొత్త రేషన్‌కార్డుల మంజూరు ఎన్నడో?

### పది నెలలుగా నిరీక్షణ



ఓగూరు వెంకటరత్నం

ఈ చిత్రంలో కనిపిస్తున్న వ్యక్తి పేరు ఓగూరు వెంకటరత్నం. సీతారామపురంలో నివాసం ఉంటున్నాడు. ఇతనికి రెండేళ్ల క్రితం వివాహమైంది. ఏడాది నుంచి తల్లిదండ్రులతో విడిపోయి వేరుగా కాపురం ఉంటున్నాడు. గత పది నెలల నుంచి కొత్త రేషన్‌కార్డు కోసం దరఖాస్తు చేసుకోవాలని సచివాలయాలు, తహసీల్దార్ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా దరఖాస్తులు స్వీకరించడం లేదు. ప్రభుత్వం నుంచి తమకు ఎలాంటి ఆదేశాలు లేనందున కొత్త రేషన్‌కార్డులకు దరఖాస్తులు తీసుకోలేమని అధికారులు చెబుతున్నారు. రేషన్‌కార్డు లేనందున ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు అందడం లేదని వెంకటరత్నం వాపోతున్నాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి రేషన్ కార్డులు మంజూరు చేయాలని వేడుకుంటున్నాడు.

- త్వరలో..త్వరలో..అంటూ ప్రకటనలకే కూటమి ప్రభుత్వం పరిమితం
- పది నెలలుగా ఎదురుచూస్తున్న పేదలు
- సచివాలయాల చుట్టూ ప్రదక్షణలు



రేషన్‌కార్డు కోసం అర్జీ అందజేస్తున్న ప్రజలు (ఫైల్)



రేషన్‌కార్డులు

**ఉదయగిరి:** టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కొత్త రేషన్‌కార్డులను మంజూరు చేయకపోవడంపై ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. జనవరి నుంచి కొత్త రేషన్ కార్డులను మంజూరు చేస్తామని మంత్రులు ప్రకటించారు. కానీ ఇంత వరకు రేషన్‌కార్డుల మంజూరుకు చర్యలు చేపట్టలేదు. త్వరలో..త్వరలో మంజూరు చేస్తామంటూ ప్రకటనలతో ఊరిస్తుండడంపై ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డుల కోసం ప్రజలు సచివాలయాల చుట్టూ తిరుగుతున్నా కనికరించే వారు కరువయ్యారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఉత్తర్వులు లేనందున దరఖాస్తులు తీసుకోలేమని సచివాలయ సిబ్బంది చెబుతున్నారు. దీంతో అర్హత కలిగిన పేదలు నిరాశతో వెనుదిరుగుతున్నారు. కనీసం ప్రస్తుతం ఉన్న రేషన్‌కార్డుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకునేందుకు కూడా అవకాశం కల్పించకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.

**గత ప్రభుత్వంలో విరివిగా కార్డులు మంజూరు**

ఎన్నికల సమయంలో అధికారంలోకి వచ్చేందుకు అనేక హామీలిచ్చిన కూటమి ప్రభుత్వం గెలిచాక వాటిని గాలికొదిలేసింది. పేద ప్రజలకు అన్ని విధాలా ఉపయుక్తంగా ఉండే రేషన్‌కార్డుల ఊసే ఎత్తడం లేదు. గత పది నెలల నుంచి కనీసం అర్హత గల వారి నుంచి దరఖాస్తులు కూడా తీసుకోలేదు. కానీ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ సచివాలయ సిబ్బందిని సంప్రదించిన వెంటనే కొత్తకార్డులు మంజూరయ్యాయి. రేషన్ కార్డుల్లో దొర్లిన తప్పొప్పులను సరిదిద్దుకునేందుకు కూడా అవకాశం కల్పించారు. కార్డుదారులకు ప్రతినెలా బియ్యం, చక్కెర, కందిపప్పు, తదితర సరుకులను విరివిగా అందించారు. సచివాలయాలను కేంద్రంగా చేసుకుని కొత్త కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి గంటల్లోనే రేషన్‌కార్డులు మంజూరు చేసిన చరిత్ర గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఉంది. వలంటీర్లు ప్రతి ఇంటికి వెళ్లి వారి అవసరాలు గుర్తించి దరఖాస్తులు తీసుకుని వాటిని మంజూరు చేయించే వారు. గత ప్రభుత్వంలో మధ్యవర్తుల జోక్యం లేకుండానే అర్హులకు రేషన్ కార్డులు అందజేసి పారదర్శకతకు పెద్దపీట వేశారు. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో అలాంటి పరిస్థితి కనిపించడం లేదు. నెలలు గడుస్తున్నా కొత్త రేషన్‌కార్డులకు అవకాశం కల్పించలేదు. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### కొత్త కార్డులు మంజూరు చేయాలి



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి పది నెలలు గడుస్తున్నా ఇంత వరకు ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వకపోవడం దారుణం. ప్రభుత్వ పథకాలకు రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకుంటున్నందున అర్హత కలిగిన పేదలు వాటికి దూరమవుతున్నారు. కొత్త కార్డుల మంజూరుపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వకపోవడంపై ప్రజల్లో అనుమానం వ్యక్తమవుతోంది. ప్రభుత్వం వెంటనే కొత్త రేషన్‌కార్డులు మంజూరుచేసి పేద ప్రజలను ఆదుకోవాలి.

– మేకపాటి రాజగోపాల్‌రెడ్డి, ఉదయగిరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త

### విధి విధానాలు రాలేదు



కొత్త రేషన్‌కార్డుల మంజూరుకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎలాంటి మార్గదర్శకాలు రాలేదు. దీంతో దరఖాస్తులు తీసుకోలేని పరిస్థితి ఉంది. ప్రభుత్వం విధి విధానాలు వెల్లడించిన వెంటనే అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

–సుభద్ర, తహసీల్దార్

## వైఎస్సార్‌సీపీ మండల కమిటీల నియామకం

**ఆత్మకూరురూరల్:** వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు మండల పార్టీ కమిటీలను నియమించారు. ఈ మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఆత్మకూరు మండలాధ్యక్షుడిగా చిట్టమూరు జితేంద్రనాగ్‌రెడ్డిని ఇప్పటికే ప్రకటించి ఉండగా, ఉపాధ్యక్షులుగా సానా వేణుగోపాల్‌రెడ్డి, పిన్నంరెడ్డి కోదండరామిరెడ్డిని నియమించారు. జనరల్ సెక్రటరీలుగా బొడ్డు గిరిబాబు, సోమవరపు సుమంత్‌రెడ్డి, చంద్రా హజరత్‌నాయుడు, కోశాధికారిగా ధనాల రమేష్‌నాయుడు, కార్యదర్శులుగా అంబటి సుబ్బారెడ్డి, దుగ్గల హనుమారెడ్డి, నెట్టెం పిచ్చినాయుడు, చిల్లూరు వెంకటేశ్వర్లు, దిశం చర్ల ప్రసాద్ నియమితులయ్యారు. కార్యవర్గ సభ్యులుగా దాడి శ్రీనివాసులు, సూరం ప్రసాద్ రెడ్డి, మాలేపాటి సతీష్, పువ్వాడి శ్రీనివాసులు నాయుడు, రావూరు శ్రీనివాసులురెడ్డి, ఏడెం శ్రీనివాసులురెడ్డి, చల్లగుంట పద్మారెడ్డి, దువ్వాడి శ్రీధర్, బొమ్మిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ముక్కమళ్ల మనోహన్‌రెడ్డి, కోర్సిపాటి రాజారెడ్డిని నియమించారు.

**సోమశిల:** అనంతసాగరం మండల ఉపాధ్యక్షులుగా ఈ సుబ్బారావు, కే నరసింహులు, ప్రధాన కార్యదర్శులుగా ఎస్ నారసింహారెడ్డి, షేక్ ఖాజామొహిద్దీన్, వై కృష్ణారెడ్డి నియమితులయ్యారు. ట్రెజరర్‌గా పీ నాగార్జునరెడ్డి, కార్యదర్శులుగా ఏ మాల్యాద్రి, ఆర్ ప్రభాకర్‌రెడ్డి, యు వెంకటకొండయ్య, కే అంజయ్య, బట్టా బాలమ్మ, ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా పీ పెంచలయ్య, బీ ధర్మేంద్ర, సీహెచ్ కృష్ణారెడ్డి, కే వెంకటేశ్వరరెడ్డి, షేక్ అబ్దుల్ రెహమాన్, డీ భాస్కర్‌రాజు, కే మహేంద్ర, జీ శీనయ్య, బీ మస్తాన్, బీ నారయ్య, కే నారసింహారెడ్డి, ఆర్ వేణురెడ్డి, మోటపోతుల బాలకృష్ణ, ఎం కార్తీక్‌రెడ్డి, ఏ రమణయ్యను నియమించారు.

**సంగం:** సంగం మండల ఉపాధ్యక్షులుగా సూరి మదన్‌మోహన్‌రెడ్డి, పూనూరు ఫణికుమార్‌రెడ్డి, జనరల్ సెక్రటరీలుగా ఏ మల్లికార్జునరావు, యర్రంశెట్టి శివకుమార్, మారుబోయిన సురేష్, ట్రెజరర్‌గా చేవూరు హరీష్, సెక్రటరీలుగా నాటకరాణి శివ, దుగ్గి అనిల్, వేమల మనోహర్, నిమ్మల జనార్దన్, కే శంకరయ్యను నియమించారు. ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా నాటకరాని వెంకయ్య, కలువాయి రజనీకాంత్, ఊసా మాధవ, తీర్థాల తిరుమలేష్, బీ సురష్, మదన్, దాసరి శీనయ్య, దేగా మధుసూదనయ్య, నెల్లూరు కోటారెడ్డి, కృష్ణారెడ్డి, దారా కామేశ్వరరావు, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ సురేష్‌రెడ్డి, పీ రాము, షేక్ ఖాజామొహిద్దీన్ నియమితులయ్యారు.

### నర్సింగ్ విద్యార్థిని అదృశ్యం

**కావలి:** పట్టణంలోని ప్రగతినగర్‌కు చెందిన నర్సింగ్ విద్యార్థిని అదృశ్యంపై కుటుంబ సభ్యులు కుటుంబసభ్యులు కావలి రెండో పట్టణ పోలీసులకు గురువారం ఫిర్యాదు చేశారు. స్థానికంగా జవహర్ భారతి నర్సింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థి బుధవారం నుంచి కనిపించడం లేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

### 104 వాహన సేవలు

**ఉదయగిరి రూరల్:** మండలంలోని గంగులవారిచెరువుపల్లెలో వైద్యాధికారిణి వినీత ఆధ్వర్యంలో 104 వాహన సేవలను గురువారం అందజేశారు. 40 మందికి వైద్యపరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. వేసవిలో వడదెబ్బకు గురికాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

## బీద లక్ష్మానందకు రెడ్‌క్రాస్ జాతీయ పురస్కారం



**కావలి :** బోగోలు మండలం బిట్రగుంట గ్రామ సచివాలయంలో సర్వేయర్‌గా పనిచేస్తున్న బీద లక్ష్మానంద ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. 2012లో ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవం సందర్భంగా కావలి విశ్వోదయ ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో పాల్గొన్న లక్ష్మానంద రెడ్‌క్రాస్ వలంటీర్‌గా మారాడు. అప్పట్నుంచి గత 12 ఏళ్లగా రెడ్‌క్రాస్ వలంటీర్‌గా, విపత్తు నిర్వహణ శిక్షకుడిగా, రక్తదాన ప్రేరేపకుడిగా సేవలు అందిస్తున్నారు విపత్తు నిర్వహణ శిక్షకునిగా రాష్ట్ర వ్యాప్తంగా ఆరు వేల మందికి శిక్షణ ఇచ్చారు. దాదాపు 20 వేల మందిని రక్తదాతలుగా మార్చారు. గతంలో గోదావరి పుష్కరాల సందర్భంగా జరిగిన తొక్కిసలాటలో ఏడుగురి ప్రాణాలను కాపాడి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రశంసాపత్రం అందుకున్నారు. వివిధ సందర్భాల్లో 13 మంది రోడ్డు ప్రమాద బాధితులకు ప్రథమచికిత్స అందించి సకాలంలో ఆస్పత్రులకు చేర్చడం ద్వారా ప్రాణాలు కాపాడాడు. కావలి రెడ్‌క్రాస్ బృంద నాయకుడిగా హుదూద్, తిత్లీ తుపానులు, చెన్నై, కేరళ వరద బాధితులకు సాయం అందించారు. లక్ష్మానంద సేవలను గుర్తించిన ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ యువ వలంటీర్లను ప్రోత్సాహించే ఉద్దేశంతో అందజేసే ఉత్తమ యువ వలంటీర్ పురస్కారానికి 2023–24 సంవత్సరానికి గాను ఎంపిక చేసింది. ఈ నెల 13న రాష్ట్రపతి భవన్‌లో జరిగే రెడ్‌క్రాస్ జాతీయ జనరల్ బాడీ సమావేశంలో జాతీయ రెడ్‌క్రాస్ చైర్మన్, కేంద్ర ఆరోగ్యశాఖ మాత్యులు జయప్రకాశ్ నడ్డా చేతుల మీదుగా పురస్కారాన్ని అందజేయనున్నారు. ఈ సందర్భంగా బీద లక్ష్మానందను కావలి ఆర్డీఓ ఎం సన్నీవంశీకృష్ణ, రెడ్‌క్రాస్ రాష్ట్ర చైర్మన్ వైడీ రామారావు, వైస్‌చైర్మన్ జగన్‌మోహన్‌రావు, కోశాధికారి పీ రామచంద్రరాజు, ప్రధాన కార్యదర్శి, విశ్రాంత ఐఏఎస్ అధికారి అశ్వనికుమార్ పరిడా, కావలి రెడ్‌క్రాస్ ఉపాధ్యక్షుడు డాక్టర్ బెజవాడ రవికుమార్, చైర్మన్ డీ రవిప్రకాష్ అభినందించారు.

## ఉపాధి శ్రామికులకు బీమా



ఉపాధి పనులు చేస్తున్న శ్రామికులు

**సీతారామపురం :** ఉపాధి పనులు చేసే శ్రామికులు ప్రమాదాలకు గురై మృతి చెందుతున్న ఘటనలు అక్కడక్కడా చోటు చేసుకుంటున్నాయి. వారికి ఎలాంటి బీమా లేకపోవడంతో కుటుంబాలకు ఆర్థిక సాయం అందని పరిస్థితి నెలకొంటోంది. ఈ పరిస్థితిని గమనించి కేంద్ర ప్రభుత్వం శ్రామికులకు ప్రమాద బీమా చేయించేలా చర్యలు తీసుకుంది. దీంతో లక్షలాది కుటుంబాలకు బీమా భరోసా లభించనుంది. జిల్లాలో 2.78 లక్షల జాబ్ కార్డులుండగా, 4.38 లక్షల మంది ఉపాధి శ్రామికులు ఉన్నారు. వీరందరిని ప్రధానమంత్రి సురక్ష యోజన, జీవనజ్యోతి బీమా యోజన పరిధిలోకి తీసుకురావాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న శ్రామికుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వివరాలు బ్యాంకుల్లో నమోదు చేయించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద 18నుంచి 70 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న కార్మికులు ఏడాదికి రూ.20 ప్రీమియం చెల్లిస్తే ప్రమాదంలో చనిపోతే బాధిత కుటుంబానికి రూ.2లక్షల పరిహారం లభిస్తుంది. ప్రధానమంత్రి జీవనజ్యోతి బీమా పథకం కింద 18 నుంచి 50 ఏళ్లలోపు ఉన్న కార్మికులు ఏడాదికి రూ.436 చెల్లిస్తే ఏ కారణంతోనైనా మరణిస్తే కుటుంబానికి రూ.2లక్షలు బీమా పరిహారం అందుతుంది.

### ఉపాధి శ్రామికులు సద్వినియోగం చేసుకోవాలి

ఉపాధి శ్రామికులకు ప్రమాద బీమా చేయించేందుకు దరఖాస్తులు స్వీకరించి వివరాలను బ్యాంకుల్లో నమోదు చేయించాలని క్షేత్రస్థాయి సిబ్బందిని ఆదేశించాం. కొత్త విధానంతో లక్షలాది ఉపాధి శ్రామికుల కుటుంబాలకు బీమా భరోసా దక్కుతుంది. **–మృదుల, ఉపాధి ఏపీడీ, ఉదయగిరి.**

# ఘనంగా కార్మికుల దినోత్సవం



కావలిలో ఏఐటీయూసీ ఆధ్వర్యంలో ప్రదర్శన



సోమశిల: అనంతసాగరంలో..



ఉదయగిరిలో ..



వరికుంటపాడులో..

**కావలి :** పట్టణంలోని వాడవాడలా కార్మికుల దినోత్స వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఏఐటీయూసీ–ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సీపీఐ కార్యాలయం నుంచి మున్సిపల్ కార్యాలయం వరకు ప్రదర్శన నిర్వహించారు. అనంతరం కార్మిక జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా జాయింట్ సెక్రటరీ రాజగోపాల్, రైతు సంఘం జిల్లా నాయకుడు బలిజేపల్లి వెంకటేశ్వర్లు, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు మల్లి అంకయ్య మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కులను హరిస్తున్నాయన్నారు. కార్మికులు ఎంతో పోరాడి సాధించుకున్న చట్టాలను తుంగలో తొక్కుతూ కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా నాలుగు లేబర్‌కోడ్‌లు తెచ్చి బానిసలుగా మార్చే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. 8 గంటల పని విధానానికి స్వస్తి పలికి 12 గంటల పని విధానాన్ని తీసుకొచ్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తహతహలాడుతున్నాయన్నారు. ప్రభుత్వం రంగ సంస్థలను ప్రైవేట్ పరం చేస్తూ నిరుద్యోగాన్ని పెంచి పోషిస్తున్నాయన్నారు. కార్పొరేట్ శక్తులకు రుణాలు, రాయితీలు ఇస్తూ గ్యాస్, పెట్రో ధరలు పెంచుతూ పేద,మధ్య తరగతి వర్గాలపై పెను భారాన్ని మోపుతున్నాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో చిన్నతరహా పరిశ్రమలు మూసివేతకు గురై లక్షలాది మంది కార్మికులు ఉపాధి కోల్పోయారన్నారు. కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, సమాన పనికి సమాన వేతనం కల్పించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, కర్షక ప్రజావ్యతిరేక విధానాలపై పోరాటనికి సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. మున్సిపల్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు తన్నీరు వెంకటేష్, ఆదినారాయణ, ఏఐటీయూసీ కావలి కార్యదర్శి వై రవి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు దమ్ము దర్గాబాబు, వై ప్రభావతి, తన్నీరు పద్మావతి పాల్గొన్నారు.

**ఆత్మకూరు:** పట్టణంలో కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ సమీపంలోని పట్టణ ఆరోగ్య కేంద్రం ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో జెండాను ఆవిష్కరించారు. సీఐటీయూ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

**సోమశిల:** అనంతసాగరంలో సీఐటీయూ, వ్యవసాయ కార్మిక సంఘం, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో మేడే వేడుకలను ఘనంగా నిర్వహించారు. బస్టాండ్ సెంటర్‌లో కార్మిక జెండాను వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి మంగళ పుల్లయ్య ఆవిష్కరించారు. అనంతరం బస్టాండ్ సెంటర్ నుంచి మెయిన్‌రోడ్డు మీదుగా ప్రదర్శన నిర్వహించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేశారు. సీఐటీయూ మండల కార్యదర్శి అన్వర్‌బాషా, మండల నాయకులు డాక్టర్ సుబ్బారాయుడు, వేము పెంచలయ్య, ఉప్పలపాడు మస్తాన్, సత్తార్, ఖాదర్‌వలీ, శ్రీనివాసులు, నాగులూరు వెంకటేష్, మీరామొహిద్దీన్, సునీత, తదితరులు పాల్గొన్నారు.

**అనుమసముద్రంపేట:** ఏఎస్‌పేటలో సీపీఎం మండల కార్యదర్శి మొఘల్ నిస్సార్ అహ్మద్ ఆధ్వర్యంలో సీపీఎం జెండాను ఆవిష్కరించారు. జిల్లా రైతు సంఘం నాయకులు గంటా లక్ష్మీపతి, కొలు రైతు సంఘం మండల కార్యదర్శి షేక్ దిలియాజ్, అబ్బీపురానికి చెందిన సీనియర్ నాయకుడు డీసీ వెంగయ్య, సీఐటీయూ నాయకులు గయాజ్, సయ్యద్ అస్లాం, తదితరులు పాల్గొన్నారు.

**సంగం:** స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద విద్యుత్ సిబ్బంది సీఐటీయూ జెండాను ఆవిష్కరించారు. కార్మికుల ఐక్యత వర్ధిల్లాలని నినాదాలు చేశారు. విద్యుత్ శాఖ సిబ్బంది, సీపీఎం నాయకుడు మురళి పాల్గొన్నారు.

**ఉదయగిరి:** స్థానిక పంచాయతీ బస్టాండ్ సెంటర్‌లో సీపీఎం ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. సీపీఎం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య పార్టీ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంచిపెట్టారు. నాయకులు రమణయ్య, ఫరీద్దీన్‌బాషా, నాగేశ్వరరావు, కామాక్షమ్మ, యస్దాని, వెంకటేశ్వర్లు, నాయబ్, తదితరులు పాల్గొన్నారు.

**ఉదయగిరి రూరల్:** గండిపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్ ఆవరణలో, కుర్రపల్లి బీసీ కాలనీలో సీపీఎం, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో మేడే వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్మిక జెండాను ఎగురవేసి వందనం చేశారు. విద్యుత్ లైన్‌మెన్ విజయ్, జూనియర్ లైన్‌మెన్ మస్తాన్, వెంకటేష్, కేశవ,తదితరులు పాల్గొన్నారు.


**వరికుంటపాడు:** మండలంలోని తిమ్మారెడ్డిపల్లి, వరికుంటపాడు సబ్‌స్టేషన్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో కార్మికుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్మిక జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. సీఐటీయూ మండలాధ్యక్షుడు ఏనుగు రమణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మట్టే హరినారాయణ, సామాజిక కార్యకర్త ఓబయ్య, సీఐటీయూ సభ్యులు యేసు, చిన్నకేశవులు, శ్రీనివాసులు, మనోజ్, చందు, నీరజ్, సర్ఫరాజ్, సమి, తదితరులు పాల్గొన్నారు.



ఉదయగిరిరూరల్: గండిపాళెం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో..



అనుమసముద్రంపేటలో..



సంగం విద్యుత్‌శాఖ కార్యాలయంలో..

## కిశోరి వికాసంపై అవగాహన



**సీతారామపురం :** స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో కిశోరి వికాసంపై అవగాహన కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఉదయగిరి సీడీపీఓ సునీత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా శుక్రవారం నుంచి జూన్ 10వ తేదీ వరకు కిశోర బాలికలకు వివిధ సామాజిక అంశాలపై అవగాహన కల్పించి చైతన్యవంతం చేయనున్నట్లు తెలిపారు. ఎంపీడీఓ భాస్కర్, డిప్యూటీ ఎంపీడీఓ భార్గవి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ తేజస్విని, అంగన్‌వాడీలు, మహిళా సంరక్షణ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



## డయాలసిస్ సెంటర్ ప్రారంభం రేపు

**వింజమూరు(ఉదయగిరి):** వింజమూరులోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ శనివారం ప్రారంభించనున్నారు. ఈ మేరకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. గురువారం ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఏర్పాట్లను పరిశీలించి ప్రభుత్వ వైద్యులతో మాట్లాడారు. కాగా వింజమూరు పరిసర ప్రాంతాల్లో కిడ్నీ రోగులు ఎక్కువగా ఉన్నారు. డయాలసిస్ చేయించుకునేందుకు నెల్లూరు, కావలికి వెళ్లాల్సి రావడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకుని గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వింజమూరు సీహెచ్‌సీకి డయాలసిస్ కేంద్రాన్ని మంజూరు చేసింది. అయితే సార్వత్రిక ఎన్నికలు రావడంతో పనులు ఆగిపోయాయి. డయాలసిస్ కేంద్రం అందుబాటులోకి వస్తే కిడ్నీ రోగులకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది.